సాక్షి రంగారెడ్డి

గురువారం । 30 । మార్చి । 2023




బ్రహ్మోత్సవాలకు రారండీ
వీసా దేవుడు.. కలియుగదైవం చిలుకూరు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది.
10లో▸



నియంత పాలనకు చరమగీతం
బీఆర్ఎస్ పాలనలో పేదల భూములు లాక్కుంటున్నారని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మండిపడ్డారు.
10లో▸



విద్యార్థులను ప్రోత్సహించాలి
తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుల్లో మరింత ప్రోత్సహించాలని ఎకానమిక్స్ హెచ్ఓడీ అంజనీ భవానీ అన్నారు.
10లో▸





మీర్‌పేట: సీతారాముల విగ్రహాలకు మంగళస్నానం చేయిస్తున్న అర్చకుడు

రాములోరి పెళ్లికి వేళాయె..

శ్రీరామనవమిని పురస్కరించుకుని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. గురువారం జరిగే సీతారాముల కల్యాణానికి దేవాలయాలను విద్యుద్దీపాలతో, పూలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. కొబ్బరి ఆకులతో కల్యాణ మండపాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాలన్నీ సరికొత్తశోభను సంతరించుకున్నాయి. శ్రీరామనామస్మరణతో ఆలయాలు మార్మోగనున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్ఎన్‌రెడ్డి నగర్ సాయిబాబా ఆలయంలో బుధవారం సీతారాముల విగ్రహాలకు మంగళస్నానాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా గోరింటాకు ఉత్సవం చేపట్టారు.

న్యూస్‌రీల్

అర్హులందరికీ కంటి పరీక్షలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి



పోమాల్‌పల్లిలో కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ జయలక్ష్మి

కేశంపేట: అర్హులందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తామని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని పోమాల్‌పల్లిలో జరుగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి అద్దాలను అందించాలన్నారు. రోజూ 150 నుంచి 200 మంది వరకు పరీక్షలను నిర్వహించాలని ఆమె సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓ ఆంజనేయులు, అప్తమాలజిస్ట్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

శిరసనగండ్ల జాతరకు ప్రత్యేక బస్సులు

తలకొండపల్లి: చారగొండ మండలం శిర్సనగండ్ల జాతరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం నిర్వహించే సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి కల్వకుర్తి నుంచి శిర్సనగండ్లకు 40 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్వకుర్తి నుంచి శిర్సనగండ్లకు పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.30 బస్ చార్జీలు వసూలు చేస్తారన్నారు. అదేవిధంగా ఆమనగల్లు నుంచి శిర్సనగండ్లకు పెద్దలకు రూ. 50, పిల్లలకు రూ. 30, మాల్ నుంచి శిర్సనగండ్లకు పెద్దలకు రూ. 50, పిల్లలకు రూ. 30 బస్ చార్జీలుంటాయని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భర్తతో గొడవ పడి భార్య ఆత్మహత్య

కూతురు మరణ వార్తవిని తల్లి..



సుమిత్ర (ఫైల్)



యాదమ్మ (ఫైల్)

షాబాద్: భర్తతో గొడవ పడి కూతురు ఆత్మహత్యకు పాల్పడగా.. మనస్తాపంతో ఆమె తల్లి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ గురువయ్యగౌడ్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని హైతాబాద్ గ్రామానికి చెందిన కుమ్మరి మల్లేశ్, యాదమ్మ దంపతులకు కుమారుడు గురుప్రసాద్, కూతురు సుమిత్ర సంతానం. ఏడేళ్ల క్రితం మల్లేశ్ మృతి చెందడంతో వీరి బాగోగులు తల్లి యాదమ్మ చూసుకునేది. కూతురు సుమిత్రకు రుద్రారం గ్రామానికి చెందిన కుమ్మరి శివకుమార్‌తో రెండున్నరేళ్ల క్రితం వివాహం జరిపించారు. దంపతుల మధ్య తరుచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో శివకుమార్ 26న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సుమిత్ర (22) మంగళవారం రాత్రి హైతాబాద్‌లో తల్లిగారి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కూతురు మరణించిందని తల్లి యాదమ్మ(45) నీటి సంపులో దూకి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

6న ఓయూలో 'బలగం' చిత్ర ప్రదర్శన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏప్రిల్ 6న సాయంత్రం 4 గంటలకు 'బలగం' సినిమాను ఉచితంగా ప్రదర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. క్యాంపస్ కాలేజీల విద్యార్థులతో పాటు నిజాం, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ కాలేజీ, కోఠి మహిళా కళాశాల విద్యార్థులకు మాత్రమే ప్రవేశం ఉన్నట్టు చెప్పారు. గూగుల్ లింక్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సందేహాలకు ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలన్నారు. 99857 01254 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

ఎట్టకేలకు మోక్షం



ఇళ్లు, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ
- 2014 జూన్ 2కు ముందున్న వాటికి అవకాశం
- తాజాగా దరఖాస్తుకు గడువు పొడిగింపు
- సర్కారుకు సమకూరనున్న రూ.135కోట్ల ఆదాయం!

ప్రభుత్వ, అర్బన్ సీలింగ్ యాక్ట్ భూముల్లో ఇళ్లు, ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.135 కోట్ల మేర ఆదాయం సమకూరనున్నట్లు జిల్లా రెవెన్యూ యంత్రాంగం అంచనా వేస్తోంది.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో 2014 జూన్ రెండుకు ముందు ఉన్న నిర్మాణాలు, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్లు 58, 59, 118 జారీ చేసి దరఖాస్తులకు అవకాశం కల్పించింది. తాజాగా దరఖాస్తు గడువును మరోసారి పొడిగించింది. అందిన అర్జీలను అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు ఉన్న నిర్మాణాలు, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. దరఖాస్తు దారులు నిర్దేశిత ఫీజు చెల్లించడమే ఆలస్యం.. ఆ తర్వాత వారంలోనే ఆయా భూములు, నిర్మాణాలు లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ అవుతుండటం విశేషం.

8,226 దరఖాస్తులకు..

జిల్లాలో జీఓ నం.58, 59 కింద 31,830 దరఖాస్తులు అందాయి. 59జీఓ కింద 13,229 దరఖాస్తులు అందగా వీటి పరిధిలో 38,43,899 గజాల విస్తీర్ణం ఉన్నట్లు అంచనా. మిగిలిన దరఖాస్తులు 58 జీఓకు సంబంధించినవి. ఇక జీఓ నంబర్ 59 కింద 2,750 దరఖాస్తులకు మోక్షం కల్పించారు. అదే విధంగా ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో అర్బన్ సీలింగ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి నుంచి ఇప్పటి వరకు 4,672 దరఖాస్తులు అందాయి. వీటిలో 2,780 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. మిగిలిన నిర్మాణాలు, స్థలాలు పెండింగ్‌లో ఉన్నాయి. మూల విలువ ప్రకారం వీటికి ఫీజులు నిర్ణయించి, నోటీసులు జారీ చేస్తున్నారు. ఇక పోడు భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం జీఓ నంబర్ 76 జారీ చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల పరిధిలో సుమారు 842 ఎకరాల అటవీ భూములు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లినట్లు సమాచారం. పొజిషన్‌లో ఉన్న భూమి కంటే ఎక్కువగా 1,086 దరఖాస్తులు అందడం విశేషం.

మూడు జీఓల కింద అందిన దరఖాస్తులు ఇలా

జీఓ నంబర్	వచ్చిన దరఖాస్తులు	ఆమోదం పొందినవి
58	18,601	2,696
59	13,229	2,750
76	1086	పెండింగ్
118	4672	2,780

"అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



ఇళ్లు, ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అకాశం కల్పించింది. 2014 జూన్ రెండుకు ముందు ఉన్న నిర్మాణాల క్రమబద్ధీకరణకు జీఓ 58, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు జీఓ 59 ప్రభుత్వం విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునేందుకు గడువును సైతం పొడిగించింది. ఏప్రిల్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను చెల్లించి భూములను క్రమబద్ధీకరించుకోవాలి. వీటిని న్యాయబద్ధంగా ప్రస్తుత మార్కెట్ ప్రకారం అమ్ముకునే అవకాశం కూడా లబ్ధిదారులకు ఉంటుంది.

– హరీశ్, కలెక్టర్

మా పథకాలు దేశానికే ఆదర్శం

- జల్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తా
- మత రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి



సభలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: పేదలు అధికంగా నివసించే జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రత్యేక నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీలో బుధవారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు పార్టీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, దళితబంధు, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, చేప పిల్లల పంపిణీ, గొర్రెల పంపిణీ లాంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి దేశానికి ఆదర్శనంగా నిలుస్తున్నారన్నారు. 5 లక్షల మంది విద్యార్థులకు వెయ్యి గురుకుల పాఠశాలల ద్వారా ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.1.20లక్షలు వెచ్చించి చదివిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల జేబులు నింపుతుంటే.. గ్యాస్, పెట్రోల్ ధరలను పెంచుతూ మోదీ పేదల జేబులు గుల్ల చేస్తున్నారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఇక్కడి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయా? అని ప్రశ్నించారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు డ్వాక్రా రుణాల వడ్డీ త్వరలోనే ఇవ్వడం జరుగుతుందన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే వారికి రూ.3 లక్షలు ఇస్తున్నామన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో 2022లో ఒక్కరోజే రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. శ్రీరాం కాలనీలో 10–11 కుల సంఘాలకు త్వరలోనే స్థలాలు కేటాయించి కమ్యూనిటీహాల్ భవనాలను కూడా నిర్మిస్తామన్నారు. శ్రీరాం కాలనీ మహిళల సౌకర్యార్థం రూ.30 లక్షలతో భవనాన్ని కూడా నిర్మిస్తామన్నారు. ముఖ్యంగా నోటరీ ఇళ్లు కలిగిన వారు ప్రభుత్వ భూములలో 100 గజాల లోపు ఇళ్లు ఉన్న వారు 58, 59 జీవో కింద దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానికంగా చిరు వ్యాపారాలు చేసుకునేందుకు కూడా అవసరమైన మేరకు స్థలాలను కూడా కేటాయిస్తామన్నారు. స్థానికంగా ఉన్న 150 మంది ట్రాన్స్‌జెండర్లకు కూడా ఏ సాయమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, పల్లపు శంకర్, లక్ష్మీనారాయణ, యంజాల జనార్దన్, ఉప్మెమూరి నిరంజన్, కైసర్ బామ్, ఎక్బాల్ ఖలీఫా, భాషమ్మ, షేక జహంగీర్, దూడల శ్రీనివాస్ గౌడ్, కొండల్ యాదవ్, సుధాకర్ గౌడ్, అర్జున్, రాజేష్, కర్నాటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- జిల్లాలో 226 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 50,303 మంది విద్యార్థులు
- కలెక్టర్ హరీశ్ వెల్లడి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు నిర్వంచేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై బుధవారం మంత్రి సబితారెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు జిల్లాలో 226 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 49,574 మంది రెగ్యులర్ , 729 మంది సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. 34 ప్రశ్న పత్రాల స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులకు సమన్వయ సమావేశాలు నిర్వహించి సూచనలు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమోరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఒక ఏఎన్ఎం సైతం అందుబాటులో ఉంటారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు .

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుదాం

- ఏసీపీ కుషాల్కర్



మాట్లాడుతున్న ఏసీపీ కుషాల్కర్

షాద్‌నగర్: పండుగలు ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ కుషాల్కర్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఆవరణలో శాంతి సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి, రంజాన్ పండుగల నిర్వహణపై చర్చించారు. అనంతరం ఏసీపీ కుషాల్కర్ మాట్లాడుతూ..పండుగలను అన్ని మతాల వారు కలిసికట్టుగా జరుపుకోవాలని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాలన్నారు. అవాంఛనీయ ఘటనలకు తావు ఇవ్వవొద్దని అన్నారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలో నిర్వహించే శోభాయాత్ర కార్యక్రమాన్ని సాయంత్రం ప్రారంభించి రాత్రి 11గంటలలోపు ముగించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కల్పిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, విశ్వహిందు పరిషత్ నేత బండారి రమేశ్,నాయకులు అబ్దుల్ రబ్ జామీ,చెట్ల వెంకటేశ్,ముక్తార్ అలీ, అశ్రఫ్, సర్వర్‌పాషా, అద్దు, గౌస్, గౌస్ జానీ, జహంగీర్, మల్చలం మురళీ పాల్గొన్నారు.

ట్రోల్ చేస్తే తోలు తీస్తారు!

- అభ్యంతరకరమైన వాటిపై చట్టప్రకారం చర్యలు
- ఇటీవల 20 కేసులు నమోదు చేసిన సైబర్ కాప్స్
- ఎనిమిది మందిని గుర్తించి నోటీసులు జారీ
- ఎమ్మెల్సీ కవితపైనా ట్రోలింగ్స్: డీసీపీ స్నేహ



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్

సాక్షి, సిటీబ్యూరో: సోషల్ మీడియాతో పాటు యూ ట్యూబ్ చానళ్లల్లో విచ్చలవిడిగా, విచక్షణ మరిచి ట్రోలింగ్స్ చేసే వారిపై నగర సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు వీటిపై కేసులు నమోదు చేసి, కంటెంట్ డిలీట్ చేయించడానికే పరిమితమయ్యారు. ఈ ధోరణి ట్రోలర్స్‌కు లోకువగా మారి మరీ రెచ్చిపోతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ నోటీసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత వ్యవహారంలో కొన్ని ట్రోలింగ్ చానల్స్ బరితెగించాయి. అభ్యంతరకరంగా, అసభ్యంగా, పరువు నష్టం కలిగించేలా, మహిళల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లేలా ఉన్న పోస్టులకు సంబంధించి 20 కేసులు నమోదు చేసి ఎనిమిది మందికి నోటీసులు ఇచ్చారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటుతో..

- దర్యాప్తు దశలోనే ఉన్న ఓ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితతో పాటు మరికొందరు రాజకీయ నాయకులపై ట్రోల్ కుర్రాడు, మిస్టర్ మస్సబ్బాయ్, యంకమ్మ ట్రోల్స్, తెలుగు ట్రోల్స్ న్యూ, చిమ్ము ట్రోల్స్, టీమ్ ఆఫ్ ట్రోలింగ్, బంతిపువ్వు ట్రోల్స్, చందు ట్రోల్స్, చెవిలోపువ్వు చానళ్లల్లో ట్రోలింగ్స్‌తో పాటు ఫొటోల మార్ఫింగ్ సైతం చేశారు. ఓ మహిళా ప్రజా ప్రతినిధిపైనే ఈ స్థాయిలో జరిగితే సాధారణ మహిళల విషయం ఏంటన్న అంశంపై సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. బాధ్యుల్ని పట్టుకోవడానికి ఇన్‌స్పెక్టర్లు పి.పద్మ, డి.దర్శుల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.
- అసెంట్‌గా పిలిచే ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ టూల్స్ ఆధారంగా దర్యాప్తు చేసిన స్పెషల్ టీమ్స్ ఈ తొమ్మిది చానళ్లకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఎనిమిది మంది బాధ్యుల్ని గుర్తించారు. ఆయా ప్రాంతాలకు వెళ్లిన పోలీసులు ఎ.శ్రీనివాసరావు (విజయనగరం), ఎస్.మణికంఠ (కడప), బి.శ్రవణ్ (నిజామాబాద్), ఎం.శ్రీను (వరంగల్), పీఎస్ జ్యోతి కిరణ్ (కృష్ణా), వి.నవీన్ (జగిత్యాల), బి.చంద్రశేఖర్ (కరీంనగర్), బి.శ్రీకాంత్‌లకు (కడప) నోటీసులు జారీ చేశారు. వీరంతా 20–30 ఏళ్ల మధ్య వయస్కులని, ఎలాంటి రాజకీయ కోణం లేకపోయినా లైక్స్, టీఆర్పీ, రెవెన్యూ కోసమే ఇలా చేస్తున్నారని గుర్తించారు. వీరితోనే ఆయా చానల్స్‌లోని కంటెంట్‌ను డిలీట్ చేయిస్తున్న పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయనున్నారు.

వదిలిపెట్టే ప్రసక్తే లేదు..

ఇలాంటి ట్రోలర్స్‌తో పాటు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్స్ పెట్టే వారికి ఇదో హెచ్చరికని, ఏ మహిళను ట్రోల్ చేసినా వదిలిపెట్టమని స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. యూ ట్యూబ్ ధోరణిపై ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్‌కు (ఐ4సీ) లేఖ రాయాలని నిర్ణయించామన్నారు. యూ ట్యూబ్ సహా మరికొన్ని సామాజిక మాధ్యమాల్లో ఉన్న అనేక అంశాలపై దృష్టి పెడుతున్నామని ఏసీఉప కేవీఎం ప్రసాద్ చెప్పారు. దీనికోసం సైబర్ క్రైమ్ ఠాణాలో సోషల్ మీడియా టీమ్ పని చేస్తోందన్న ఆయన నిర్దిష్ట ఫిర్యాదులు లేకపోవడంతో కేసులు నమోదు చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. కరాటే కళ్యాణి మాదిరిగా ప్రతి సామాజిక కార్యకర్త ముందుకు వచ్చి ఈ వ్యవహారాలపై ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసి, బాధ్యతలపై చర్యలు తీసుకుంటామన్నారు.

డ్వాక్రా మహిళలకు ఉత్తమ ఎంటర్ ప్రైజెస్ అవార్డులు

మహేశ్వరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి ఇద్దరు డ్వాక్రా మహిళలు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. వారిని బుధవారం జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్ పలువురు అధికారులు అభినందించారు. మండల పరిధిలోని హర్షగూడకు చెందిన డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు నిఖిత, తుమ్మలూరు గ్రామానికి చెందిన మండల సమాఖ్య అధ్యక్షురాలు కవిత ఉత్తమ ఎంటర్ ప్రైజెస్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎం సత్యనారాయణ మాట్లాడుతూ.. మండలానికి చెందిని ఇద్దరికి ఉత్తమ అవార్డులు రావడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఫలితాలు సాధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఎం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్, చిత్రంలో ఏపీఎం సత్యనారాయణ

జీఓ 58తో పేదలకు లబ్ధి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెం.58తో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటచారి అధ్యక్షతన నిర్వహించిన మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన 483మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎళ్ల నుంచి ఇంటి పట్టాలు లేక ఇబ్బంది పడుతున్న పేదలకు మేలు చేసేందుకే సీఎం కేసీఆర్ ఇళ్ల క్రమబద్ధీకరణకు జీఓ 58ను విడుదల చేశారని చెప్పారు. ఇళ్లు లేని పేదలకు గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. అర్హులు ఏప్రిల్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, తహసీల్దార్ అనితారెడ్డి, ఎంపీపీ బుర్ర రేఖ, జెడ్పీటీసీ సభ్యుడు దాసగౌడ్ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

భర్త కొట్టాడని మహిళ బలవన్మరణం

మొయినాబాద్: భర్త కొట్టాడని మనస్తాపం చెందిన ఓ మహిళ పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని అమీర్‌గూడలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి తెలిపిన ప్రకారం.. అమీర్‌గూడ గ్రామానికి చెందిన మేకగూడెం జంగయ్య అలియాస్ జగన్, సుజాత అలియాస్ బాలమణి(45) దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ నెల 24 పెద్ద కూతురు అనూషకు కొడుకు పుట్టడంతో ఆమెను 27న రాత్రి 10 గంటలకు పుట్టింటికి తీసుకువచ్చారు. 28న రాత్రి దంపతులిద్దరూ గొడవ పడుతూ.. జగన్ భార్యపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆమె తలకు గాయమైంది. మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.


బాలమణి మృతదేహం

బాలాజీ బ్రహ్మోత్సవాలకు రారండి

- రేపటి నుంచే చిలుకూరులో ఉత్సవాలు
- ముస్తాబైన వీసాదేవుడి దేవాలయం
- వచ్చే నెల 7వరకు విశేష పూజలు


ఉత్సవాలకు సిద్ధమవుతున్న దివ్యరథం


చిలుకూరు బాలాజీ దేవాలయం

మొయినాబాద్: వీసా దేవుడు.. కలియుగదైవం చిలుకూరు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతూ.. తెలంగాణ తిరుపతిగా పేరొందిన చిలుకూరు బాలాజీ దేవాలయం ఉత్సవ వేడుకలకు ముస్తాబైంది. ఐదు శతాబ్ధాల చరిత్ర కలిగిన చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి తరువాత దశమి రోజు నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అ క్రమంలోనే శుక్రవారం నుంచి బాలాజీ బ్రహ్మోత్సవాలు ప్రారంభమై వచ్చే నెల 7 వరకు కొనసాగనున్నాయి.

ఏర్పాట్లు పూర్తి

చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల కోసం ఏర్పాట్లన్నీ చేపట్టారు. స్వామివారిని ఊరేగించే రథానికి మరమ్మతులు చేయించారు. బ్రహ్మో త్సవాల సందర్భంగా స్వామివారికి రోజు అందించే వాహన సేవలకు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారు.

31న అంకురార్పణ

బాలాజీ బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సెల్వర్ కూత్తుతో అంకురార్పణ జరుగనుంది. మొదట పుట్ట మన్ను తెచ్చి హోమగుండాలను ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. వచ్చే నెల ఒకటిన ధ్వజారోహణం, శేషవాహన సేవలు అందిస్తారు. 2న స్వామివారికి గోపవాహన, హనుమంత వాహన సేవలు నిర్వహిస్తారు. 3న సూర్యప్రభ వాహనం, గరుడ వాహన సేవలు అందిస్తారు. అదే రోజు రాత్రి 10.30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం చేపడతారు. 4న వసంతోత్సవం, గజవాహన సేవలు, 5న పల్లకీ సేవ, అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారి దివ్యరథోత్సవము ఊరేగింపు కార్యక్రమాలుంటాయి. 6న మహాభిషేకము, ఆస్థాన సేవ, అశ్వవాహన సేవ, దోప్‌సేవ, పుష్పాంజలి సేవలు చేస్తారు. 7న చక్రతీర్థం, ధ్వజావరోహణం, ద్వాదశారాధనం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

గరుడ ప్రసాదం వితరణ..

బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజారోహణ కార్యక్రమం చేపడతారు. ఈ సందర్భంగా గరుత్మంతునికి పెట్టే నైవేద్యాన్ని సంతానం లేని మహిళలకు ప్రసాదంగా వితరణ చేస్తారు. గరుడ ప్రసాదం తీసుకున్నవారికి సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తుండడంతో ప్రతి సంవత్సరం గరుడ ప్రసాదానికి ఆదరణ పెరుగుతుంది. ప్రతి సంవత్సరం సుమారు 3–5 వేల మంది మహిళలు గరుడ ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు.

నియంత పాలనకు చరమగీతం


తులేకలాన్‌లో భారత్ జోడో యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలపై మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి ధ్వజం

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ పాలనలో పేదల భూములు లాక్కుంటున్నారని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మండిపడ్డారు. మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్‌లో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్ ఆధ్వర్యంలో జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. కానీ దేశంలో, రాష్ట్రంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు నియంత పాలన చేస్తున్నాయని మండిపడ్డారు. పరిశ్రమల కోసం కారుచౌకగా భూములు తీసుకుంటున్నారని చెప్పారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, తులేకలాన్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, సీపీఎం పార్టీలకు చెందిన 80 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్‌రెడ్డి రంగారెడ్డి వీరికి పార్టీ శాలువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కొంద్రు ప్రవీణ్, మంకాల దాసు, రవీందర్‌రెడ్డి, యాచారం వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పాండు, సాయి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధమవ్వాలి

సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుదర్శన్


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీపీఐ ఎంఎల్ నాయకులు

తుర్కయంజాల్: బీజేపీ కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించి సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం సాధించేందుకు ప్రజలు పోరాటాలకు సిద్ధమవ్వాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ చేపట్టిన జన చైతన్య యాత్రలో భాగంగా బుధవారం తుర్కయంజాల్‌లో సాగర్ రహదారిపై రోడ్ షో నిర్వహించారు. అనంతరం రాగన్నగూడలోని రాజీవ్ గృహకల్పలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సుదర్శన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కోట్లు కట్టబెడుతూ పేదలపై భారం మోపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి, పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, బోడ సామేల్, డి.జగదీశ్, జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్, సీ.హెచ్. జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రుల సన్నిధిలో సీఎం సతీమణి

నల్లకుంట: నల్లకుంట పాతరామాలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన సీతారామచంద్రుల పూజల్లో సీఎం కేసీఆర్ సతీమణి శోభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ప్రధాన అర్చక స్వామి అనంతాచారి వేద మంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. పూజల్లో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. సీఎం సతీమణి ప్రతి నెలా ఈ ఆలయంలో పూజలు, హోమాలు నిర్వహిస్తుంటారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్ పర్సన్ విశాలరెడ్డి


గిరిజన వేషధారణ విద్యార్థులతో విశాలరెడ్డి, ఉపాధ్యాయులు

కేశంపేట: విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, కేశంపేట, కాకునూర్ గ్రామాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలను నిర్వహించారు. పాపిరెడ్డిగూడ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడిని జయించాలని సూచించారు. పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యగౌడ్, రసూల్, పాపిరెడ్డిగూడ, కాకునూర్ గ్రామాల సర్పంచ్‌లు తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

దేశ సేవలో యువత భాగస్వాములవ్వాలి

రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ టీఎస్ఏ నారాయణన్


మాట్లాడుతున్న టీఎస్ఏ నారాయణన్

ఆమనగల్లు: దేశ సేవలో యువత భాగస్వాములు కావాలని రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ టీఎస్ఏ నారాయణన్ సూచించారు. విద్యార్థులు పట్టణంలోని వివేక విద్యాభారతి హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన పరంవీర్ వందన్, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి టీఎస్ఏ నారాయణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు పరంవీర్ చక్ర అవార్డు పొందిన ఆర్మీ అధికారులకు ఎన్‌సీసీ విద్యార్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు వందనం సమర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. దేశ భద్రత, సమగ్రత కోసం ఆర్మీ నిరంతరం శ్రమిస్తుందన్నారు. దేశ భద్రత కోసం యువతీ, యువకులు సైన్యంలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ జాల ఉపేందర్, కందుకూరు ఎంపీడీఓ వెంకట్రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమూద్, కరస్పాండెంట్ జి.శ్రీనివాసులు, డైరెక్టర్ ఎ.శివలింగం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

ఎకానమిక్స్ హెచ్‌ఓడీ అంజనీ భవానీ

షాద్‌నగర్: తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుల్లో మరింత ప్రోత్సహించాలని ఎకానమిక్స్ హెచ్‌ఓడీ అంజనీ భవానీ అన్నారు. బుధవారం పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో ఉన్న రవీంద్రభారతీ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంజనీ భవానీ మాట్లాడుతూ.. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటుగా అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని అన్నారు. తద్వార విద్యార్థులు చదువుల్లో మరింత పట్టు సాధిస్తారని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమీల, క్రాంతి కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు


స్నాతకోత్సవంలో సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థులు

చైర్‌పర్సన్‌పై చర్యలు తీసుకోవాలి

- పలువురు కౌన్సిలర్ల డిమాండ్
- రాజీనామా పత్రాలు ఇచ్చేందుకు యత్నం
- తిరస్కరించిన అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఇబ్రహీంపట్నం: అవినీతి అక్రమాలకు పాల్పడిన చైర్ పర్సన్ కప్పరి స్రవంతిపై చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కోరం లేకుండా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి 2023–24 బడ్జెట్‌ను ఆమోదించారని, పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్లకు ఇచ్చిన హామీ మేరకు బుధవారం మధ్యాహ్నం కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. బడ్జెట్‌పై చర్చ జరిపి కౌన్సిలర్లు సందేహాలను తెలుసుకున్నారు. సమావేశం ముగిసిన అనంతరం అదనపు కలెక్టర్‌కు బీఆర్‌ఎస్‌తోపాటు మరో ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు అడ్డుతగిలారు. చైర్‌పర్సన్ స్రవంతిపై జూన్ 2022లో ఫిర్యాదు చేసిన ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. చైర్‌పర్సన్‌పై చర్యలు తీసుకోకుంటే తమకు ఈ కౌన్సిలర్ పదవులొద్దంటూ రాజీనామా పత్రాలు ఇచ్చేందుకు యత్నించగా ఆయన తిరస్కరించారు. ఆ అధికారం తనకు లేదని జేసీ చెప్పుకొచ్చారు.

నిబంధనల ప్రకారమే బడ్జెట్ ఆమోదం: చైర్‌పర్సన్

మున్సిపల్ నియమ నిబంధనల ప్రకారమే బడ్జెట్‌ను ఆమోదించామని చైర్‌పర్సన్ స్రవంతి తెలిపారు. కోరం లేకపోవడంతో సోమవారం కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేశామన్నారు. ఆ రోజు కోరం ఉన్నా.. లేకున్నా బడ్జెట్‌ను ఆమోదించవచ్చనే నిబంధన మేరకే ఆమోదం తెలిపామని వివరించారు.


అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు రాజీనామా పత్రాలు ఇచ్చేందుకు యత్నిస్తున్న కౌన్సిలర్లు